

వైవీయూ ఎల్ఎల్‌బి మొదటి సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి - కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం అనుబంధ లా కళాశాలల విద్యార్థులకు ఎల్ఎల్‌బి మొదటి సెమిస్టర్ పరీక్షలు మంగళవారం వైవీయూలో ఏపీజే అబ్దుల్ కలాం గ్రంథాలయ భవనంలో ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలను రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ ఆచార్య కె.ఎస్.వి.కృష్ణారావుతో కలసి తనిఖీ చేశారు. పలువురి విద్యార్థుల హాల్ టికెట్లను పరిశీలించారు. కట్టుదిట్టంగా పరీక్షలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. పరీక్షల అడిషనల్ చీఫ్ సూపరింటిండెంట్లు డాక్టర్ లక్ష్మీప్రసాద్, డాక్టర్ ముని కుమారి మాట్లాడుతూ 684 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారని, 99 గైర్హాజరయ్యారని తెలిపారు. నిర్వహణకు అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని వివరించారు. ఈ పరీక్షలు ఈనెల 9 వరకు కొనసాగుతాయన్నారు. పరీక్ష కేంద్రం అబ్జర్వర్ డా.వి.రామకృష్ణ కేంద్రాన్ని పరిశీలించారు. పరీక్షల నిర్వహణ సిబ్బంది పి.చంద్రమౌళి పాల్గొన్నారు.

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల

సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య

ప్రజాశక్తి - కడప అర్బన్

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కోశాధికారి గోపి అధ్యక్షతన 36 జీవో ప్రకారం రూ.24,500 వేతనాలు ఇవ్వాలని ఏడు రోడ్స్ వద్ద ఊరి తాళ్లతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిస్కారం కాకపోతే నిరవధిక సమ్మె తప్పదని హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు దాదాపు 13000 వేల మంది ఉన్నారని పేర్కొన్నారు. లైటింగ్, వాటర్, హార్టికల్చర్, టౌన్ ప్లానింగ్, డ్రైవర్స్‌గా పని చేస్తున్నారని తెలిపారు. నిత్యం ప్రజలకు సేవ చేసే మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం యోగా పేరుతో రూ.300 కోట్లు దుర్వినియోగం చేయడంలో ఉన్న శ్రద్ధ కార్మికుల వేతనాలు పెంచడంలో లేదని చెప్పారు. కార్మికుల న్యాయం చేయకుంటే, సంక్షేమ పథకాలు అమలు చెయ్యకుంటే, ఆప్కాస్‌లో ప్రభుత్వ ఉద్యోగులు అని తొలగించాలని చెప్పారు. లేని పక్షంలో నిరవధిక సమ్మె తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్ భాస్కర్, సహాయ కార్యదర్శి బ్రహ్మానందరెడ్డి, సుబ్బారాయుడు, గురువయ్య, చాపయ్య, గోవర్ధన్, కేశవ, రాంమోహన్ రెడ్డి, శరత్, శ్రీధర్, శ్రీకాంత్, ఆంజనేయులు, ఈశ్వర్‌రెడ్డి, శివ, చిన్నారెడ్డయ్య, రాజా, నాగరాజు, సురేంద్ర, గంగాధర్, మస్తాన్, ఓబులేసు, యల్లయ్య, సత్యనారాయణ, వీరా నారాయణ, సోమిరెడ్డి, ఆంజనేయులు, సిద్ధయ్య, సుబ్బలక్షుమ్మ, నారాయణ, సుబ్బారాయుడు, హరినాయక్, శ్రీను, సుబ్బయ్య, పాలకొండరాయుడు, హనుమంత్ రెడ్డి, అంజి, శివ,నరసింహ, సుబ్బయ్య, కార్మికులు పాల్గొన్నారు.



మెడకు ఉరేసుకుని నిరసన తెలియజేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు



అర్ధ నగ్న ప్రదర్శన, మోకాళ్లపై నిరసన తెలియజేస్తున్న మున్సిపల్ యూనియన్ నాయకులు

నగరపాలక సంస్థ ఎదుట అర్ధనగ్న, మోకాళ్లపై నిరసన

ఇంజినీరింగ్ కార్మికులు సమస్యల పరిష్కారానికి కొద్దిరోజుల చేస్తున్న ఆందోళన కార్యక్రమాలకు మద్దతుగా నగరపాలక సంస్థ పారిశుధ్య కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం నగరపాలక సంస్థ వద్ద అర్ద నగ్న ప్రదర్శన చేస్తూ మోకాళ్లపై కూర్చుని తమ నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సిఐటియు నగర అధ్యక్షులు చంద్రారెడ్డి మాట్లాడుతూ ఇంజినీర్ కార్మికులు సగటు రూ.12 వేల వేతనంతో కుటుంబాలు పోషించుకోలేక ఎన్నో మార్లు ఆందోళనలు, ధర్నాలు, వినతి పత్రాలు ఇచ్చిన ఫలితం లేకుండా పోయిందని చెప్పారు. 24 రోజులుగా ఆందోళన చేస్తుంటే ఈ ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమని చెప్పారు. పారిశుధ్య కార్మికులు వారి పిల్లలకు తల్లికి వందనం పథకం అమలు కాకపోవడం, ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపకపోవడం దారుణమని పేర్కొన్నారు. పారిశుధ్యకార్మికులు, అవుట్ సోర్సింగ్ వారిని కూడా రెగ్యులర్ ఉద్యోగులుగా ఆన్‌లైన్‌లో చూపించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. మున్సిపల్ యూనియన్ నగర అధ్యక్షులు సుంకర రవి మాట్లాడుతూ సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. సహాయ కార్యదర్శి ఇత్తడి ప్రకాష్ మాట్లాడుతూ 30 ఏళ్లుగా అవుట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరారు. దేశంలో ఉన్న అన్ని రాష్ట్రాలలో రెగ్యులర్ చేశారని గుర్తు చేశారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే, కార్మికుల పట్ల దయ ఉంటే వెంటనే రెగ్యులర్ చేయాలని పేర్కొన్నారు. ఇంజినీరింగ్ కార్మిక సమస్యలు ఇకనైనా పరిష్కరించకపోతే ఈనెల 4న చలో విజయవాడ కార్యక్రమం చేయబోతున్నామని హెచ్చరించారు. కార్యక్రమంలో డ్రైవర్ యూనియన్ కార్యదర్శి సుంకర కిరణ్, వడ్లపల్లి శ్రీధర్, బాబు నాగరాజు, సాయి, హరికృష్ణ ,హాజరత్,కొండయ్య, కాటమయ్య, శివ, ఆదాము, సాయమ్మ, పెంచలమ్మ, రమణి, పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు.

ముగిసిన ట్రిపుల్‌ఐటి కౌన్సెలింగ్ ప్రక్రియ

- 1010 సీట్లకు గాను 878 మందికి ప్రవేశాలు
- మిగిలిన సీట్లకు త్వరలో రెండవ జాబితా విడుదల



సర్టిఫికెట్లు పరిశీలన కోసం వేచి ఉన్న విద్యార్థులు

ప్రజాశక్తి - వేంపల్లె

ఆర్‌జియుకెటి పరిధిలోని ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటిలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు రెండు రోజుల పాటు నిర్వహించిన మొదటి విడత కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తి అయినట్లు డైరెక్టర్ ఎ.వి.ఎస్. కుమారస్వామి గుప్తా పేర్కొన్నారు. రెండు రోజులపాటు నిర్వహించిన కౌన్సెలింగ్ ప్రక్రియలో భాగంగా 1010 సీట్లకు సంబంధించి అభ్యర్థులకు కాల్ లెటర్లు పంపగా 878 మంది విద్యార్థులు హాజరై ప్రవేశాలు పొందారు. రెండోవ రోజైన మంగళవారం కూడ విద్యార్థులకు ఎటువంటి అంతరాయాలు లేకుండా కౌన్సెలింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించారు. పకడ్బందీగా అధికారులు కౌన్సెలింగ్ పక్రియను నిర్వహించడంతో విద్యార్థుల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. అన్నమయ్య జిల్లా సుండుపల్లి గ్రామానికి చెందిన అంచెల శ్రీధర్ అనే విద్యార్థి ఇటీవలే ప్రమాదానికి గురై నడవలేని స్థితిలో క్యాంపస్ లోని గ్రంథాలయం వద్ద ఉండడం గమనించి డైరెక్టర్ స్వయంగా అ విద్యార్థితో మాట్లాడి కౌన్సెలింగ్ ప్రక్రి యను పూర్తి చేసి విద్యార్థికి ప్రవేశపత్రాన్ని అందజేశారు. దీంతో ఆ విద్యార్థి తండ్రి శ్రీరాములు డైరెక్టర్‌కు ధన్య వాదాలు తెలిపారు. త్వరలో రెండవ జాబితా విడుదల చేయనున్నట్లు డైరెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి రవికుమార్, డీన్ అకాడమిక్ రమేష్ కైలాష్, ఫైనాన్స్ అధికారి కోటేశ్వరి, అధ్యాపకులు లింగమూర్తి, జ్ఞాన వెంకట్, అసోసియేట్ డీన్స్ రాఘవరెడ్డి, రఫీ, నవీన్, క్యాంపస్ మెయింటెన్స్ ఇన్‌ఛార్జులు పవన్ కుమార్, శ్రీకాంత్ రెడ్డి, తిరుపతిరెడ్డి, దీప్తి, బిన్నీ, కోనప్ప, భాస్కరయ్య, మహేంద్ర, కార్తీక్, అధ్యాపకులు పాల్గొన్నారు.

రైల్వే ఛార్జీల పెంపును రద్దు చేయాలి

- అదనపు బోగీల ఏర్పాటు, పరిశుభ్రతపై దృష్టి పెట్టాలి
- కడప రైల్వే స్టేషన్ మేనేజర్‌కు సిపిఎం వినతి



రైల్వే మేనేజర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

కేంద్ర ప్రభుత్వం నుంచి పెంచిన రైల్వే ఛార్జీలను ఉపసంహరించుకోవాలని సిపిఎం కడప నగర కార్యదర్శి రామమోహన్ డిమాండ్ చేశారు. మంగళవారం సిపిఎం కడప నగర కమిటీ ఆధ్వర్యంలో కడప రైల్వే స్టేషన్ మేనేజర్ శేఖర్ కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రామమోహన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైల్వే ఛార్జీలను కిలోమీటర్లు ఒక పైసా, రెండు పైసలు పెంచడం వల్ల సామాన్య ప్రజలకు ఇబ్బంది కలిగే పరిస్థితి ఉందన్నారు. పెంచిన రైల్వే ఛార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రైల్వే శాఖ ప్రతి రైల్లో సామాన్య ప్రజల కోసం ఆరు కంపార్ట్‌మెంట్లు కేటాయించాల్సి ఉండగా రెండు నుంచి నాలుగు మాత్రమే కేటాయిస్తున్నారని తెలిపారు. దీని కారణంగా రైల్వేలో సామాన్య, మధ్యతరగతి ప్రయాణికులు భోగిల్లో క్రిక్కిరిసి వెళ్లాల్సిన పరిస్థితి ఉంటుందన్నారు. ఈ సమస్యను పరిష్కారం చేయాలంటే అన్ని రైళ్లలో తప్పకుండా ఆరు జనరల్ భోగిలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని స్టేషన్ మేనేజర్ దృష్టికి తీసుకెళ్లారు. రైల్వే రిజర్వేషన్ల విషయంలో ప్రయాణికుల డిమాండ్‌ను బట్టి వెయిటింగ్ లిస్ట్ కాకుండా అదనపు బోగీలను కేటాయించే విధంగా రైల్వే శాఖ నిర్ణయం తీసుకోవాలని పేర్కొన్నారు. దీనివల్ల అటు రైల్వేకు, ఇటు ప్రయాణికులకు సౌకర్యవంతంగా, లాభదాయకంగా ఉంటుందన్నారు. రైల్వే జనరల్ కంపార్ట్‌మెంట్‌లో ప్రయాణం చేసే సామాన్య ప్రజల సమస్యలను ప్రత్యేకంగా పరిష్కరించేందుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. భోగిల్లో మంచి నీటి సౌకర్యం, బాత్రూంలను పరిశుభ్రంగా ఉండాలన్నారు. రైల్వే స్టేషన్లలో అవసరమైన వస్తువుల కొనుగోలుకు అధిక ధరలు వసూలు చేస్తున్నారని, దీని పై దృష్టి సారించాలని తెలిపారు. ఈ సమస్యలన్నిటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేయాలని కోరారు. దీనిపై మేనేజర్ సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దస్తగిరి రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, రామకృష్ణారెడ్డి, నరసింహ, తిమ్మయ్య పాల్గొన్నారు.

జమ్మలమడుగు రూరల్ : డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ మంగళవారం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో జమ్మలమడుగు రైల్వే స్టేషన్ మేనేజర్‌కు వినతి పత్రం సమర్పించారు. కేంద్ర ప్రభుత్వం గడిచిన కాలంలో అనేక సందర్భాలలో రైల్వేఛార్జీలను పెంచుకుంటూ పోతుందని అన్నారు. అందులో భాగంగానే జులై1 నుండి సామాన్య ప్రయాణికులపై భారం మోపిందని వాపోయారు. రైల్వే ఛార్జీలను పెంచడం దారుణం అన్నారు. కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యాకులు సుబహాన్, నాయకులు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

దేశవ్యాప్త కార్మిక సమ్మెకు వామపక్షాల సంపూర్ణ మద్దతు

- సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్

ప్రజాశక్తి - కడప అర్బన్

9న దేశవ్యాప్త సమ్మెకు వామపక్షాలు సంపూర్ణ మద్దతు ఇస్తున్నాయని, బిజెపి అనుసరిస్తున్న విధానాలు పేదలను పీడించేవిగా ఉన్నాయని సిపిఎం జిల్లా కార్యదర్శి జి చంద్రశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం సిపిఎం జిల్లా కార్యాలయంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బాదుల్లా అధ్యక్షతన 9 దేశవ్యాప్త ఆల్ ట్రేడ్ యూనియన్ సమ్మెకు మద్దతుగా, జిల్లాలోని ఏడు వామపక్ష పార్టీల కార్యాచరణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ బిజెపి, ఎన్‌డిఎ ప్రభుత్వం 2014 నుంచి దేశాన్ని పరిపాలిస్తుందని పేర్కొన్నారు. దేశంలో నెలకొన్న సంకీర్ణ రాజకీయాల యుగాన్ని మతతత్వీకరిస్తుందని ఆరోపించారు. బిజెపి అనుసరిస్తున్న ఆర్థిక, రాజకీయ, సామాజిక, సాంఘిక విధానాలు, దేశ ప్రజలను, పేదలను పీడించేవిగా ఉన్నాయని తెలిపారు. భారత రాజ్యాంగ శాసనబద్ధ స్వేచ్ఛకు ఆటంకాలు సృష్టిస్తూ, భారత రాజ్యాంగ పీఠికలోని లౌకికవాదం, ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, కార్మికుల హక్కులు, పౌరుల హక్కులు మంట కలుపుతోందని విమర్శించారు. సమావేశంలో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిజం-లేనినిజం) లిబరేషన్ జిల్లా కార్యదర్శి ఓబ య్య, భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్ - లేనినిస్టు) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి డబ్ల్యూ.రాము, ఆర్.ఎస్.పి. జిల్లా కార్యదర్శి సుబ్బరాయుడు, ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి జయవర్ధన్, ఆర్.ఎం.పి.ఐ. జిల్లా కార్యదర్శి రమణయ్య, సిపిఎం, సిపిఐ, సిపిఐ(ఎం.ఎల్)న్యూ డెమోక్రసీ, సిపిఐ (ఎం.ఎల్)లిబరేషన్, ఆర్.ఎస్.పి, ఫార్వర్డ్ బ్లాక్, ఆర్.ఎం.పి.ఐ, వామపక్ష పార్టీల జిల్లా నాయకులు ఏ.రామ్మోహన్, కె.శ్రీనివాసులు రెడ్డి, బి.దస్తగిరి రెడ్డి, రామకృష్ణారెడ్డి, నరసింహులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్

జమ్మలమడుగు రూరల్ : జులై 9న దేశవ్యాప్త సమ్మె ను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వీరనాల శివనారాయణ తెలిపారు. సమ్మెకు సంబంధించిన కరపత్రాలను మైలవరంలో విడుదల చేశారు. కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు సమస్యల పరిష్కారం కోసం చేసే దేశవ్యాప్త సమ్మెకు ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం సంపూర్ణ మద్దతు తెలుపుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు కొండయ్య, దాసు, సంజీవ రాయుడు, ముని పాల్గొన్నారు.

సంస్థ, సంఘం రెండు కళ్లు : ఎస్ఐసి

ప్రజాశక్తి - కడప అర్బన్ : సంస్థలో బాధ్యతగా పనిచేస్తామని, సంఘం ఆధ్వర్యంలో రాజీలేని పోరాటం చేస్తామని, ఎల్ఐసిని ప్రభుత్వ రంగంలో కాపాడుకుంటామని, మరింత బలోపేతం చేసుకుంటామని ఉద్యోగుల సంఘం కడప డివిజన్ ప్రధాన కార్యదర్శి రఘునాథ్ రెడ్డి అన్నారు. మంగళవారం యూనియన్ 75 వ ఆవిర్భావ దినం సందర్భంగా డివిజన్ అధ్యక్షుడు అవధానం శ్రీనివాస్ యూనియన్ పతాకావిష్కరణ చేశారు. అనంతరం నేతలు 75 సంవత్సరాల యూనియన్ లోగో ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా డివిజన్ ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి మాట్లాడుతూ మోసకారి ప్రయివేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు వ్యతిరేకంగా తమ సంఘం 1951 నుంచి ఐదేళ్లపాటు పోరాడిందని, ఆ తర్వాతే జాతీయకరణ జరిగి ఎల్ఐసి సంస్థ ఏర్పాటు అయిందని గుర్తు చేశారు. అందుకే ఎల్ఐసి సంస్థ అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం మానస పుత్రిక అన్నారు. తాము సిబ్బందిగా సంస్థను, సంఘాన్ని రెండుకళ్లుగా భావిస్తామని అన్నారు. 75 ఏళ్లు నిండిన సీనియర్లను కడప డివిజన్ యూనియన్ సంస్థాపక నాయకులు ఖాదర్‌బాషా శంకర్రావు, చంద్రశేఖర్ రెడ్డి, ఎఆర్ఎస్ బాబు, గంగయ్యను గౌరవంగా సత్కరించారు.

చిత్తూరు జట్టుపై అనంతపురం విజయం

ప్రజాశక్తి - కడప : వైఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో నిర్వహించిన మ్యాచ్‌లో చిత్తూరు జట్టుపై 10 వికెట్ల తేడాతో అనంతపురం జట్టు ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్‌లో చిత్తూరు జట్టు 189 పరుగులు చేసింది. 5 వికెట్ల నష్టానికి 179 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో రెండవ రోజు బ్యాటింగ్ ప్రారంభించిన అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్ లో 58.2 ఓవర్లలో 260 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని రెహాన్ అద్భుతంగా బ్యాటింగ్ ప్రదర్శించి 163 పరుగులు (సెంచరీ) చేశాడు. చిత్తూరు జట్టులోని సాయి చరణ్ అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి 6 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన చిత్తూరు జట్టు 34.5 ఓవర్లలో 99 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. అనంతపురం జట్టులోని వరుణ్ సాయి నాయుడు అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించాడు. 13.5 ఓవర్లు బౌల్ చేసి అందులో 5 ఓవర్లు మేడిన్ చేసి 32 పరుగులు ఇచ్చి 7 వికెట్లు తీసుకోవడం విశేషం. సాయి ప్రతాప్ రెడ్డి 3 వికెట్లు తీసుకున్నాడు. దీంతో చిత్తూరు జట్టు 29 పరుగుల విజయ లక్ష్యాన్ని అనంతపురం జట్టు ముందు ఉంచింది.

చలో రాజమండ్రిని విజయవంతం చేయండి

ప్రజాశక్తి - కడప రజక ఆకాంక్ష సమావేశం సందర్భంగా చేపట్టిన చలో రాజమండ్రి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కడప జిల్లా రజక సంఘం అధ్యక్షులు చేలో రవి పిలుపునిచ్చారు. రజకులను ఎస్‌సి జాబితాలో చేర్చాలనే రజకుల చిరకాల కోరిక మేరకు ఈ నెల 6న రాజమండ్రి నగరం శ్రీ వెంకటేశ్వర ఆనం కళాక్షేత్రంలో రజక ఆకాంక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా రజక సంఘం అధ్యక్షులు ఆధ్వర్యంలో హాజరయ్యేందుకు చలో రాజమండ్రి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని రజకులు అందరూ రాజమండ్రికి తరలి రావాలని పిలుపునిచ్చారు.

వల్లూరులో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఫాతిమా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్, హాస్పిటల్, కడప యాజమాన్య సెక్రటరీ జవ్వాద్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సల్మాన్ ఆధ్వర్యంలో మంగళవారం వల్లూరు బస్టాండ్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరంలో జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, గైనకాలజిస్ట్, ఆర్థోపెడిక్స్, పీడియాట్రిక్స్, ఇఎన్‌టి డెంటలు, చర్మ, ఊపిరితిత్తుల వ్యాధులు కంటి సమస్యలకు సంబంధించి వైద్య సేవలు అందించారు. వల్లూరు పరిసర ప్రాంతాల నుంచి 150 మంది వైద్య శిబిరానికి హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో వైద్య బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

మండల సమస్యలపై ప్రత్యేక దృష్టి : ఎంపిపి

ప్రజాశక్తి-చెన్నూరు : మండల సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరమెంతైనా ఉందని ఎంపిపి చీర్ల సురేష్‌యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంపిడిఒ సభాభవనంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండలంలో నెలకొన్న అనేక సమస్యలపై మండల సమావేశంలో మండల అధికారులు. ప్రజా ప్రతినిధులు చర్చించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ఎంపిపి మాట్లాడుతూ కొనేళ్ల హేవేకు వెళ్లిన స్థలం పోయిన బాధితులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని పలుమాల అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇంతవరకు ఎలాంటిచర్యలు తీసుకోలేదని చెప్పారు. ఇటుక బట్టీల వద్ద పనిచేసే కూలీల పిల్లలు పాఠశాలకు వెళ్లడం లేదని, ఎంఇఒ వారిని గుర్తించి పాఠశాలకు చేర్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. తహశీల్దార్ సరస్వతి మాట్లాడుతూ ఈ విషయం కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. రుద్రభారతి పేటలోని ప్రభుత్వ స్థలా కు బోర్డు ఏర్పాటు చేయాలని ఉప్పరపల్లె ఎంపిటిసి సభ్యులు.నిరంజన్ రెడ్డి తహశీల్దార్‌కు విన్నవించారు. వ్యవసాయ అధికారి శ్రీదేవి మాట్లాడుతూ మండలానికి ఒక డ్రడోన్ మంజూరయిందని, రైతులకు 80 శాతం సబ్సిడీతో అందజేస్తామని తెలిపారు. అన్నారు. కొండ పేట సర్పంచ్ తుంగ చంద్ర యాదవ్ మాట్లాడుతూ పెన్నా నది నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని పేర్కొన్నారు. కెసి కెనాల్ అధికారి మాట్లాడుతూ ఈనెల 3న నంద్యాలలో సమావేశం ఉందని కెనాల్‌కి ఎప్పుడు నీరు వచ్చేది ఆరోజు తెలుస్తుందని అన్నారు.సమావేశంలో నీటి సంఘం అధ్యక్షుడు వెంకట సుబ్బారెడ్డి, వైస్ ఎంపిపి సుబ్బారెడ్డి, ఎంపిటిసి నాగిరెడ్డి, సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి, ఎంపిడిఒ కిరణ్ మోహన్ రావు, డాక్టర్ సతీష్, ఉమామహేశ్వరరావు, విద్యుత్ ఎఇ రామలింగారెడ్డి ఎంఇఒలు గంగిరెడ్డి. సునీత అధికారులు పాల్గొన్నారు.



సభాదృష్టికి సమస్యలు తెలియజేస్తున్న ప్రజాప్రతినిధులు



మాట్లాడుతున్న డిసిసి అధ్యక్షులు విజయజ్యోతి

కౌలు రైతులకు బకాయిలు వెంటనే విడుదల చేయాలి : డిసిసి

ప్రజాశక్తి - కడప

రాష్ట్రవ్యాప్తంగా రబీ సీజన్‌లో ధాన్యం సరఫరా చేసిన సుమారు 46,000 మంది కౌలు రైతులకు రూ.1000 కోట్లకు పైగా బకాయిలు ప్రభుత్వం ఇప్పటికీ విడుదల చేయకపోవడం చాలా బాధాకరమని విజయజ్యోతి పేర్కొన్నారు. బకాయిల చెల్లింపులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. విత్తనాల కోసం అప్పులు చేసి, ధాన్యం తాకట్టు పెట్టిన రైతులకు ఇప్పటికీ చెల్లింపులు అందకపోవడం దారుణం అన్నారు. తక్షణమే అన్ని బకాయిలను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. హైదరాబాద్ సమీపంలోని సిగాచి ఫార్మాస్యూటికల్ యూనిట్లో జరిగిన భారీ పేలుడులో 42 మంది ప్రాణాలు కోల్పోయిన దుర్ఘటన పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. బాధిత కుటుంబాలకు తక్షణమే న్యాయం చేయాలని, ప్రభుత్వం ఎక్స్గ్రేషియా చెల్లింపులతో పాటు బాధ్యత వహించాల్సిందిగా ఆమె డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో సిరాజుద్దీన్, డిసిసి ఉపాధ్యక్షుడు, విజయ్ కుమార్, సుశీల్ కుమార్ యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మొయినుద్దీన్, మైనారిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మామిళ్ల బాబు, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు, పాలెం హరిప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పేస్ట్, బ్రష్‌లు పంపిణీ

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని ఎన్‌జిఒ కాలనీలో ఉన్న జాహ్నవి హ్యాపీ అవర్స్ ప్లే స్కూల్, రిషి వ్యాలీ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో డాక్టర్స్ డే సందర్భంగా మంగళవారం డాక్టర్ ఆదర్శ్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా పేస్టులు, బ్రష్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ వెంకట అశోక్ గిరి మాటాడుతూ విద్యార్థులకు నూతన విద్యా విధానాన్ని అందజేస్తూ ఉన్నామని చెప్పారు. యాపిల్ నుంచి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ స్కూలులో మొదటిసారి తామే ప్రారంభించామని తెలిపారు. ప్రతి శనివారం స్కిల్ డే నిర్వహిస్తున్నామని చెప్పారు. వివిధ రంగాలలో ఉన్నవారితో కమ్యూనికేషన్ స్కిల్స్ ఎలా చేసుకోవాలి అనే కార్యక్రమాన్ని విద్యార్థులకు అలవాటు చేస్తూ ఉన్నామని చెప్పారు. డాక్టర్ ఆదర్శ్ రెడ్డి మాట్లాడుతూ దంత సంరక్షణ పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ మిర్జా, డాక్టర్ సందీప్, డాక్టర్ శ్వేత, స్కూలు ప్రిన్సిపల్ వసుంధర, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బ్రష్‌లు, పేస్టు అందజేస్తున్న వైద్యులు

వైద్యులకు ఘన సన్మానం

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఇంటాక్ గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్ లయన్ కె.చిన్నపరెడ్డి ఆధ్వర్యంలో జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక మానస ఇన్ సమావేశ మందిరంలో నగరానికి చెందిన ప్రముఖ వైద్యులను ఘనంగా సన్మానించారు. సీనియర్ వైద్యులు పుత్తా బాలిరెడ్డి, మానసిక వైద్య నిపుణులు నిచ్చెనమెట్ల అశోక్ కుమార్, స్త్రీ వ్యాధి నిపుణురాలు నిర్మల, న్యూరో ఫిజీషియన్ జగదీశ్వర రెడ్డి, షుగర్ వ్యాధి నిపుణులు వారణాసి ప్రతాప్ రెడ్డి, డాక్టర్ కృష్ణ కిశోర్ రెడ్డి, హోమియో వైద్యులు ఆర్. రంగనాథ రెడ్డి, శ్రీనివాసులు, కార్డియాలజిస్ట్ శ్రావణ్ కుమార్ రెడ్డి, బృంగి మహేష్, సైకాలజిస్ట్ ఓ.వెంకటేశ్వరరెడ్డి, ఫిజియోథెరపిస్ట్ అమీర్ బాషాను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇంటాక్ కో - కన్వీనర్ పి.వి.సుబ్బారెడ్డి, బోగాల కొండారెడ్డి, పోతుల వెంకట్రామిరెడ్డి, శివశంకర్ రెడ్డి, రాఘవేంద్ర వర్మ,కొండూరు జనార్ధన్ రాజు పాల్గొన్నారు.

రక్తదాతలను అభినందించిన జిజిహెచ్ సూపరింటెండెంట్

ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో డాక్టర్స్ డే సందర్భంగా ప్రభుత్వ డాక్టర్స్ అసోసియేషన్, ఎపి జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు ప్రారంభించారు. 115 మంది రక్తదానం చేశారు. వారిని సూపరింటెండెంట్ అభినందించారు. కార్యక్రమంలో జిఎంసి ప్రిన్సిపల్ డాక్టర్ జమున, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సూపరిం టెండెంట్ డాక్టర్ సునీల్ కుమార్ రెడ్డి, సిఎస్ ఆర్ఎంఒలు డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ రాజేశ్వరి, డాక్టర్ శోభారాణి, డాక్టర్ రాజేంద్ర, డాక్టర్ ఎస్.ఎ. ఎస్ ఫరూ క్, డాక్టర్ సి.వి.ఎస్ రాయుడు, డాక్టర్ విష్ణు, డాక్టర్ నిఖిల్, డాక్టర్ స్వామి దాస్, డాక్టర్ రామ మనోహర్, డాక్టర్ రామసుబ్బారెడ్డి, డాక్టర్ ప్రతాప్ పాల్గొన్నారు.



రక్తదాతకు సర్టిఫికెట్ ఇస్తున్న సూపరింటెండెంట్

ప్రజాశక్తి - పోరుమామిళ్ల : మదర్ థెరిస్సా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బ్రయాన్స్ హాస్పిటల్‌లో ఇంటర్నేషనల్ డాక్టర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని హాస్పిటల్ వైద్యులు డాక్టర్ మౌనిక రెడ్డి, డాక్టర్ చిత్తా అమితారెడ్డి, డాక్టర్ ఆనంద్ కేక్ కట్ చేశారు. అనంతరం ఆస్పత్రి సిబ్బందిని శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రంగసముద్రం సర్పంచి చిత్తా రవి ప్రకాష్ రెడ్డి, జడ్‌పిటిసి ముత్యాల ప్రసాద్, ఒఎల్ఎఫ్ ప్రధానో పాధ్యాయులు చిత్తా ఆరోగ్య రాణి, వైసిపి జిల్లా యువజన కార్యవర్గ సభ్యులు జగదీష్, మహబూబ్ బాషా ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.



డాక్టర్స్ డే ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ రీజినల్ డైరెక్టర్ బి.రామగిడ్డయ్య, ప్రజాశక్తి సిబ్బంది



పోస్టాఫీసు సిబ్బందిని సత్కరిస్తున్న తులసిరెడ్డి, నాయకులు

పోస్ట్‌మ్యాన్ అందరి బంధువు

ప్రజాశక్తి - వేంపల్లె

సమాచారానికి సంబంధించిన జాబులు రూపంలో అందరికీ అందించే పోస్ట్‌మ్యాన్ అందరి బంధువని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం జాతీయ పోస్టల్ ఉద్యోగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కాంగ్రెస్ నాయకులు వేంపల్లె పోస్టాఫీసులో పనిచేస్తున్న ఆవుల వెంకట శివయ్య, రామమూర్తి, సాహిదాను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ పోస్టల్ శాఖ అవినీతి లేనిదని కొనియాడారు. ఎండనక, వాననక, ఆరోగ్యాన్ని సైతం లెక్క చేయకుండా పోస్టల్ సిబ్బంది పని చేస్తారని ప్రశంసించారు. వారి సేవలను సమాజం గుర్తించాలని తులసిరెడ్డి కోరారు. కార్యక్రమంలో పులివెందుల నియోజక వర్గం సమన్వయ కర్త ధ్రువకుమార్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్రమణ్యం, ప్రొద్దుటూరు పూల నజీర్, వేంపల్లె మండల శాఖ అధ్యక్షుడు రామకృష్ణ, అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, రమణ, నాగరాజు, వేమారాజా, బద్రి, రాఘవయ్య, మహమ్మద్ అలీ, బండారు వెంకటేష్ పాల్గొన్నారు.

క్రైస్తవుల ఆత్మగౌరవ పోరాటాన్ని గుర్తించాలి

ప్రజాశక్తి - వేంపల్లె

షెడ్యూల్డ్ కులాల, హిందూ మతం నుండి క్రైస్తవంలోకి మారిన తాము రిజర్వేషన్లు వదులుకుని బిసిసి, మైనారిటీ క్రైస్తవులుగా జీవిస్తున్నామని, ఏ ప్రభుత్వంలోనూ, ఏ రాజకీయ పార్టీలోనూ తమకు న్యాయం జరగడం లేదని శారోన్ మెడికల్ అడ్వాన్స్‌మెంట్, రిలీఫ్ ట్రస్టు చైర్మన్ పండింటి డేవిడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో షెడ్యూల్డ్ కులాల నుండి క్రైస్తవంలోకి మారినప్పటికి క్రైస్తవులుగా 70ఏళ్లుగా ఓటు బ్యాంకుగానే మిగిలి పోయినట్లు చెప్పారు. రాజకీయ పార్టీలు గుర్తించని వ్యక్తులుగా సమాజంలో మిగిలిపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. 1950 ప్రెసిడెన్షియల్ ఆర్డర్ ద్వారా అప్పటి కేంద్ర ప్రభుత్వం షెడ్యూల్డ్ కులాల నుండి క్రైస్తవంలోకి మారిన వారిని బిసి సిలుగా మార్చిందని తెలిపారు. బిసిసి, మైనారిటీ క్రైస్తవులకు ఉన్న ఒక్క శాతం రిజర్వేషన్‌ను 8శాతానికి పెంచాలని కోరారు. అన్ని స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసి సి వర్గం వారికి రిజర్వేషన్స్ కల్పించాలని సూచించారు. మైనారిటీ కమిషన్ చైర్మన్ పదవి క్రైస్తవులకు కేటాయించాలన్నారు. విద్య, ఉద్యోగం, రాజకీయం, వ్యాపార అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. బిసి సి ఆధ్వర్యంలో నడుస్తున్న విద్యాసంస్థలకు 5 ఎకరముల ప్రభుత్వ భూమి కేటాయింపు చేసి భవనాలు నిర్మించుకొనుటకు రాయితీ రుణాలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు : ఎస్‌బిఐ

ప్రజాశక్తి - ఖాజీపేట

ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించి, వారి మన్ననలు పొందడమే ఎస్‌బిఐ లక్ష్యమని ఖాజీపేట శాఖ బ్రాంచ్ మేనేజర్ శ్రీవాణి పేర్కొన్నారు. స్థానిక మెయిన్ బజారులో ఉన్న ఎస్‌బిఐలో మంగళవారం 70 వార్షికోత్సవాన్ని ఖాతాదారులతో కలిసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ శ్రీవాణి ఖాతాదారులను ఉద్దేశించి మాట్లాడుతూ బ్యాంకు సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. రుణాలు సకాలంలో చెల్లిస్తేనే బ్యాంక్ అభివృద్ధి బాట పడుతుందన్నారు. ఇందుకు ఖాతాదారులు సహకరించాలని సూచించారు. బ్యాంకుల ద్వారా తక్కువ వడ్డీకే రుణాలు ఇస్తున్నామని, సద్వినియోగం చేసుకుని పురోగతి సాధించాలన్నారు. కార్యక్రమంలో ఖాతాదారులు, వ్యాపారవేత్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

అందుబాటులో బిఆర్ఎస్ సెంటర్

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

మండల పరిధిలోని గూడెంచెరువు గ్రామంలో మంగళవారం ప్రకృతి వ్యవసాయ స్టేట్ కమ్యూనికేషన్ అధికారి సురేష్ బయో రీసెర్చ్ సెంట ర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు కషాయాలు, ద్రావణాలు రాజీలేని అంశాలు అందు బాటులో ఈ సెంటర్‌లో దొరుకు తాయ న్నారు. ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు అందుబాటులో ఘన జీవామృతం, ద్రవ జీవా మృతము లభిస్తాయన్నారు. విని యోగించుకోవాలని ప్రకృతిని, భూమిని కాపాడుకోవాలని వివరించారు. అనంతరం డిపిఎం ఎస్‌వి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ రైతులకు కషాయాలు, ద్రావణాలు, ఘనజీవామృతం రైతులకు అందుబాటులో ఉంచడం కోసం ఈ బయో రీసర్చ్ సెంటర్‌ను ప్రారం భించామన్నారు. జమ్మలమడుగు ఎఒ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వ్యవ సాయంతో మన ఆరోగ్యాలు బాగుపడతాయన్నారు. కార్యక్రమంలో విఎఎ శివ శంకర్, అడిషనల్ డీపీఎం వసంతకుమారి, ఎన్‌ఎఫ్‌ఎ నరసింహారెడ్డి, మాస్టర్ ట్రైనర్ శ్యామ్, మోడల్ మేకర్ మాధవి, రమేష్, బాలనారాయణ, గురుమూర్తి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



సెంటర్‌ను ప్రారంభిస్తున్న అధికారులు

క్రైం కార్నర్

ఒంటరి మహిళ దారుణ హత్య..?

- దుర్వాసన రావడంతో పోలీసులకు స్థానికులు సమాచారం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల పట్టణంలోని గుంత బజారుకు చెందిన ఒంటరి మహిళ హసీనా (46) అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికుల కథనం మేరకు.. హసీనా పట్టణంలోని వివేకానంద పాఠశాల సమీ పంలో నివసిస్తుంది. హసీనా కువైట్ నుంచి వచ్చి వివాహం చేసుకోకుండా ఒంటరిగా ఉంటూ వడ్డీలకు డబ్బు ఇచ్చేది. హసీనా నివాసం నుంచి దుర్వాసన వస్తున్నడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సీఐ చాంద్ భాషా, ఎస్ఐ నారాయణ సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. హసీనా గొంతు, చేతులపై రక్త గాయాలు ఉండడంతో హసీనాను ఎవరైనా హత్య చేశారా..? అనే అనుమానం రేకెత్తింది. నాలుగు, ఐదు రోజుల క్రితం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. డాగ్ స్క్వాడ్, ఫింగర్ ప్రింట్ ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కడప రిమ్స్ తరలించారు. షబ్బీర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.



హసీనా (ఫైల్ ఫొటో)

గంజాయి స్వాధీనం : ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

వాహనాలు తనిఖీలో అనుమానాస్పదంగా వ్యవహరించిన ముగ్గురు వ్యక్తులను తనిఖీ చేయగా గంజాయి దొరికిందని ఎస్ఐ రవికుమార్ తెలిపారు. సోమవారం సాయంత్రం సింహాద్రిపురం సాయిబాబా గుడి వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా పార్నపల్లి నుంచి ముగ్గురు వ్యక్తులు 250 గ్రాముల గంజాయితో వచ్చారన్నారు. వారిని తనిఖీ చేయగా వారి వద్ద గంజాయి లభించడంతో కేసు నమోదు చేసి కోర్టుకు రిమాండ్‌కు పంపామన్నారు.

అన్ని పరిస్థితుల్లో చిరుధాన్యాల సాగు



చిరుధాన్యాల ప్రయోజనాలను వివరిస్తున్న డాక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - వేముల

వ్యవసాయ పరిస్థితి ఏమైనప్పటికీ చిరుధాన్యాలను పండించవచ్చని కడప ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ అంకయ్య కుమార్ తెలిపారు. స్థానిక చాగలేరు గ్రామ పంచాయతీలోని రైతు సేవా కేంద్రం వద్ద కడప ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం మహిళలు, నిరుద్యోగ యువత కోసం మెరుగైన ఆరోగ్యం-వ్యవస్థాపక అభివృద్ధికి చిరుధాన్యాల ప్రాముఖ్యతపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరు ధాన్యాల పంటలు తక్కువ నీటితో, తక్కువ పెట్టుబడితో, వర్షాధార పంటగా కూడా పండించవచ్చునన్నారు. చిరుధాన్యాల్లో పురుగు, తెగుళ్లు చాలా తక్కువ అని వివరించారు. సైంటిస్ట్ కమ్యూనిటీ సైన్స్ డాక్టర్ ప్రశాంతి చిరు ధాన్యాల రకాలు, ఆరోగ్య ప్రయోజనాల గురించి వివరించారు. అన్ని వయసుల వారు చిరు ధాన్యాల వినియోగాన్ని పెంచాలని కోరారు. మానవ శరీరంలో చిరుధాన్యాలు పేగు ఆరోగ్యానికి, రక్తపోటును తగ్గించడానికి, డయాబెటిస్, ఎముకల ఆరోగ్యానికి మంచిదని సూచించారు. కార్యక్రమంలో పులివెందుల వ్యవసాయ సహాయ సంచాలకులు ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ పనిముట్ల వాడకం, యాంత్రీకరణ ఆవశ్యకత, వ్యవసాయంలో డ్రోన్ ప్రాముఖ్యత గురించి సూచించారు. కార్యక్రమంలో ఎఒ జిపి ఓబులేసు, సర్పంచ్ అర్జున, ఎఇఒ సురేష్, లక్ష్మి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేయాలి



క్షేత్రస్థాయిలో వ్యవసాయాధికారులు, రైతులు

ప్రజాశక్తి - చాపాడు

రైతులకు వెంటనే పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేయాలని మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కె.నాయబ్ రసూల్ అధికారులను కోరారు. మండలంలోని ఖాదర్‌పల్లి, నాగులపల్లి గ్రామాలలో మంగళవారం వ్యవసాయ అధికారులు పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖాదర్‌పల్లెలో నాయబ్ రసూల్ మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువు విత్తనాలు వెంటనే పంపిణీ చేయాలని సూచించారు. సీజన్ రావడంతో రైతులు బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేసుకుంటున్నారని, అధికారులు ముందస్తుగా పంపిణీ చేయడంలో విఫలమయ్యారన్నారు. ఎడిఎ కృష్ణమూర్తి మాట్లాడుతూ జీలగ విత్తనాల కొరత అధికంగా ఉందని, రైతులకు ప్రస్తుతానికి జనుము విత్తనాలు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మండలానికి 150 క్వింటాళ్ల జీలగలు ఇప్పటికే పంపిణీ చేపట్టామన్నారు. రాయితీతో సూక్ష్మ పోషకాలు పంపిణీ చేస్తామని ఎడిఎ తెలిపారు. కార్యక్రమంలో ఎఒ దేవి పద్మలత, టిడిపి నాయకులు జైనుల్లా, నారాయణరెడ్డి, విఎఎ గిరిధర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ముద్దనూరు : బత్తాయి పంటలో సూక్ష్మధాతు పోషకాల లోపం నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి వెంకటకృష్ణారెడ్డి రైతులకు సూచించారు. ముద్దనూరులో మంగళవారం ఎఒ ఆధ్వర్యంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. బత్తాయి పంటలో ఆకులపైన సూక్ష్మధాతు లోపాల నివారణకు ఫార్ములా 4 పిచికారీ చేసుకోవాలన్నారు. కాయ పూత, పిందె దశలో పిచికారీ చేస్తే కాయ సైజు బాగా పెరిగి నాణ్యత వస్తుందన్నారు. పత్తి పంటలో రసం పీల్చే పురుగుల ఉధృతి నివారణకు ఎకరానికి 10 చొప్పున పసుపు రంగు జిగురు అట్టలను అమర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : జీవామృతం మొక్కకు ప్రాణమని వ్యవసాయాధికారులు సూచించారు. మండలంలోని యర్రబల్లె-2 రైతుసేవా కేంద్రంలో ఎఒ వి.చెన్నారెడ్డి అధ్యక్షతన పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం అన్నదాత సుఖీభవ పథకాన్ని త్వరలో ప్రారంభించనుందన్నారు. పులివెందుల మండలంలో 4,567 మంది రైతులు ఈ పథకం ద్వారా లబ్ది పొందుతారని తెలిపారు. కందులు, మినీ కిట్స్ పూర్తిగా ఉచితంగా ఇస్తున్నామన్నారు. కంది సాగుచేసే రైతులు రైతు సేవ కేంద్రం సిబ్బందిని సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ అరటి మొక్కకు కావాల్సిన పోషకాల కోసం జీవామృతం తయారీ అక్కడే డెమోగా చేసి రైతులకు చూపించారు. మోడల్ మేకర్ యామిని లత, డిజిటల్ సుభహాన్, రైతు సేవ కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సింహాద్రిపురం :సన్న, చిన్నకారు రైతుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అందజేస్తున్న చేస్తున్న మినీ కిట్లను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల టిడిపి నాయకుడు పుప్పాల శ్రీధర్‌రెడ్డి, ముద్దనూరు వ్యవసాయ శాఖ ఎడి వెంకటసుబ్బయ్య కోరారు. మండలంలోని బలపనూరు, అంకాలమ్మ గూడూరులో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఎఒ కల్యాణ్‌కుమార్, ఆర్ఎస్‌కె, ప్రకృతి, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

గాలి మరలు, బయో గ్యాస్ ప్రాజెక్టుకు స్థల పరిశీలన

ప్రజాశక్తి - ముద్దనూరు

గాలి మరలు, రిలయన్స్ బయో గ్యాస్ ప్రాజెక్టు ఏర్పాటుకు మంగళవారం జమ్మలమడుగు ఆర్‌డిఒ సాయిశ్రీ చింతకుంట, బొందలకుంట, యామవరం గ్రామాలను పరిశీలించారు. చింతకుంట, బొందలకుంట గ్రామాల్లో గాలిమరలు, యామవరంలో రిలయన్స్ బయోగ్యాస్ ప్రాజెక్టును ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. అనంతరం ముద్దనూరు బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించి వంటగది, తరగతి గదులు పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. అసంపూర్తిగా ఉన్న భవనాలు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని ప్రధానోపాధ్యాయులు ఓబులేసు ఆర్‌డిఒను కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ అలీఖాన్, డిప్యూటీ తహశీల్దార్ వరద కిషోర్ రెడ్డి, ఆర్ఐ పెంచలలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులను ఆదరించాలి

ప్రజాశక్తి - వేంపల్లె

విభిన్న ప్రతిభావంతులను ప్రతి ఒక్కరూ ఆదరించాలని డాక్టర్ షాహీన్ కోరారు. మంగళవారం జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా స్థానిక భవిత కేంద్రంలోని విభిన్న ప్రతిభావంతుల చిన్నారులకు డాక్టర్ షాహీన్ ఆధ్వర్యంలో అతిథిభోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సీనియర్ వైద్యులైన ఎస్‌ఎఫ్ బాషాను ఎంఇఒ వెంకటరామిరెడ్డి, భవిత కేంద్రం సిబ్బంది శాలువతో ఘనంగా సత్కరించారు. అనంతరం పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విభిన్న ప్రతిభా వంతులకు సహకరించిన రాత సహాయకులకు బహుమతులను ఎంఇఒ వెంకటరామిరెడ్డి అందజేశారు. డాక్టర్స్ దినోత్సవం సందర్భంగా చిన్నారులకు అతిథి భోజనం ఏర్పాటు చేయడం సంతోషకరమని ఎంఇఒ చెప్పారు. కార్యక్రమంలో భవిత కేంద్రం ఐఇఆర్టీలు యశోద, సుజాత, ఎంఇఒ-2 స్టాలిన్ ఐజాక్, ఎంపిపి మెయిన్ పాఠశాల హెచ్‌ఎం ఆంజనేయులు, ఉర్దూ పాఠశాల హెచ్‌ఎం ప్రసాద్, ఫిజియోథెరపిస్టు ఆనంద్, సిజివి సుజాత, తల్లిదండ్రులు, చిన్నారులు పాల్గొన్నారు.

డాక్టర్ రాజేష్‌కుమార్ సేవలు భేష్

చాపాడు : మండల వైద్యాధికారిగా రాజేష్‌కుమార్ అయిదేళ్లుగా అందించిన సేవలు మరువరానివని డిప్యూటీ డిఎంఎంహెచ్‌ఒ మల్లేష్ తెలిపారు. మండల వైద్యాధికారిగా విధులు నిర్వహించి సాధారణ బదిలీలో బద్వేలు మండలం చెన్నకేశంపల్లికి వెళుతున్న సందర్భంగా మంగళవారం ఆయనకు సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎంతో నిబద్ధతతో పనిచేశారని కొనియాడారు. పీహెచ్‌సీ పరిధిలో వైద్య సేవలను ప్రజలకు అందేలా చూస్తూ మంచి పేరు తెచ్చుకున్నారన్నారు. అనంతరం వివిధ హోదాల్లో పనిచేస్తూ బదిలీపై వెళుతున్న సిబ్బంది, ఏఎన్ఎంలను సన్మానించారు. మండల వైద్యాధికారి శివప్రసాద్ రెడ్డి, వైద్యులు శ్రీవాణి, కావ్య శ్రీ, ఓబులేసు, సిహెచ్‌ఒ మహదేవ్ యాదవ్, ఆరోగ్య విస్తరణ అధికారి రాఘవయ్య, పిహెచ్‌ఎన్ సుకన్య, సూపర్వైజర్లు బాబురెడ్డి, ప్రసాద్, భాస్కర్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మంచి ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె

రాబోవు పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యను అందించాలని మండల విద్యాధికారి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పాములూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 విద్యా సంవత్సరంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం తగ్గిందన్నారు. 2025-26 సంవత్సరంలోనైనా వంద శాతం ఫలితాలు వచ్చేందుకు ఉపాధ్యాయులు ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేసి విద్యార్థులకు విద్యా బోధన చేయాలని కోరారు. విద్యా కమిషనర్ ఆదేశాల మేరకు ప్రతి పాఠశాలను తనిఖీ చేసి ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ఉపాధ్యాయులతో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం పాములూరు పాఠశాల నుండి బదిలీ అయిన ఉపాధ్యాయులను ఎంఇఒ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైసిపి జిల్లా విద్యార్థి విభాగం జనరల్ సెక్రటరీగా రాయుడు

ప్రజాశక్తి - చాపాడు

చాపాడు మండలం చియ్యపాడుకు చెందిన రాయుడును వైసిపి జిల్లా విద్యార్థి విభాగం జనరల్ సెక్రటరీగా నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. 30 మంది సభ్యులతో జిల్లా కమిటీని మంగళవారం ప్రకటించింది. ఈ కమిటీలో విద్యార్థి విభాగం జనరల్ సెక్రటరీగా తనకు చోటు కల్పించినందుకు రాయుడు ఎంపీ అవినాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల సమస్యలపై పోరాడుతామన్నారు.



రామచంద్రారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీ, మాజీ ఎమ్మెల్యే, నాయకులు

వైసిపి తరపున అండగా నిలుస్తాం

ప్రజాశక్తి - ఖాజీపేట

వైసిపి తరపున ప్రతి కార్యకర్త కుటుంబానికి అండగా నిలుస్తామని, ఏ ఒక్కరూ అధైర్యపడవద్దని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని బి.కొత్తపల్లె పంచాయతీ బక్కాయపల్లెలో మంగళవారం పత్తి రామచంద్రారెడ్డి అనే రైతు కుటుంబాన్ని ఎంపీ, మాజీ ఎమ్మెల్యే ఎస్. రఘు రామిరెడ్డి పరామర్శించారు. ఇటీవల అప్పుల బాధ తాళలేక రామ చంద్రారెడ్డి పురుగుల ఆత్మహత్యకు పాల్పడిన విషయం విదితమే. ఈ సందర్భంగా కడప ఎంపీ అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ కుటుంబానికి అండగా ఉంటుందని, పిల్లల బాగోగులన్నీ తాము చూసుకుంటామన్నారు. ప్రతి కార్యకర్తకు తప్పక న్యాయం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర నాయకులు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, నాయకులు రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి, పివి రాఘవరెడ్డి, మురళీ మోహన్‌రెడ్డి, డిఎల్ శ్రీనివాసులరెడ్డి, మైదుకూరు నియోజకవర్గం రైతు విభాగం అధ్యక్షులు జి.నాగిరెడ్డి, అభిమానులు, కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

తాగునీటికి నిధులు విడుదల చేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె

పులివెందుల పట్టణానికి తాగునీటి పనుల కోసం రూ.50 కోట్లు నిధులు విడుదల చేయాలని పులివెందుల కాంగ్రెస్ పార్టీ సమన్వయ కర్త ధ్రువకుమార్ రెడ్డి కోరారు. మంగళవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పులివెందుల నగరానికి తాగునీటి పనుల కోసం రూ.65 కోట్ల ప్రతిపాదనలు పంపగా రూ.15 కోట్లు మాత్రమే మంజూరు చేశారని, మిగిలిన రూ.50 కోట్లు కూడా కూటమి ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరారు. పులివెందుల పురపాలక సంఘ పరిధిలో తాగునీటి సరఫరా, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక నిధుల కింద రూ.65 కోట్లు మంజూరు చేయాల్సిన అవసరం ఉందన్నారు. క్లియర్ వాటర్ సంప్, పంప్ హౌస్, పంప్ సెట్లు, క్లియర్ వాటర్ ఫీడర్, 3,800 కెఎల్ సామర్థ్యం ఉన్న ఎలివేటెడ్ లెవల్ సర్వీస్ రిజర్వాయర్లు, డిస్ట్రిబ్యూషన్ మెయిన్లు నిర్వహణ పనులు చేపట్టాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నిధుల విడుదలలో జాప్యం చేయవద్దని కోరారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రామకృష్ణ, జిల్లా నాయకులు వేమా రాజా, బద్రీనాథ్, నాగరాజా, సుబ్రమణ్యం, రాఘవయ్య, ఉత్తన్న పాల్గొన్నారు.

తులసిరెడ్డిని సన్మానించిన కాంగ్రెస్ శ్రేణులు

20 సూత్రాల ఆర్థిక కార్యక్రమం మాజీ చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 20 సూత్రాల ఆర్థిక దినోత్సవం సందర్భంగా ఆయనను సన్మానించారు. కాంగ్రెస్ మండల కన్వీనర్ బీగాల రామకృష్ణ మాట్లాడుతూ దారిద్ర్య నిర్మూలన, సామాన్య మానవుని జీవన ప్రమాణాల పెంపు లక్ష్యాలతో 1975 జూలై 1న నాటి ప్రధాని ఇందిరాగాంధీ 20 సూత్రాల ఆర్థిక కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. రోశయ్య, కిరణ్ కుమార్‌రెడ్డి ముఖ్యమంత్రులుగా ఉన్న సమయంలో తులసిరెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో క్యాబినెట్ హోదాలో 20 సూత్రాల ఆర్థిక కార్యక్రమం చైర్మన్‌గా పని చేశారని తెలిపారు. కార్యక్రమంలో పులివెందుల నియోజక వర్గం సమన్వయ కర్త ధ్రువకుమార్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్రమణ్యం, ప్రొద్దుటూరు పూల నజీర్, అమర్నాథ్‌రెడ్డి, ఉత్తన్న, నాగరాజు, వేమారాజా, బద్రి, రాఘవయ్య, రమణ, మొహమ్మద్ అలీ, బండారు వెంకటేష్ పాల్గొన్నారు.

నేడు గండి క్షేత్రంలో బహిరంగ వేలం

- పాలకమండలి సభ్యులతో సమావేశం

ప్రజాశక్తి - చక్రాయపేట

రాయలసీమలో పేరు ప్రసిద్ధి చెందిన గండిక్షేత్రంలో బుధవారం బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు గండి ఆలయ పాలకమండలి చైర్మన్ కావలి కృష్ణతేజ, ఆలయ సహాయ కమిషనర్ జె.వెంకటసుబ్బయ్య తెలిపారు. గండి క్షేత్రంలో ఈనెల 25 నుంచి ఆగస్టు 28 వరకు జరుగు శ్రావణమాస ఉత్సవాల ఏర్పాట్లలో భాగంగా ప్రత్యేక పూల అలంకరణ, విద్యుత్ దీపాలంకరణ, చలువ పందిళ్లు, బారికేడ్లు ఏర్పాటు, ఫొటోలు, వీడియో రికార్డింగ్, స్వాగత ఆర్చీలు, ప్రత్యేక భజంత్రీల ఏర్పాట్లకు సంబంధించి సీల్డ్ టెండర్లు, దేవస్థాన ఆవరణలో తాత్కాలిక దుకాణాలు పెట్టుకుని వ్యాపారం చేసుకొనుటకు ఖాళీ స్థలాన్ని ప్లాట్లుగా విభజిస్తారు. వీటికి గండిక్షేత్రం కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. టెండర్ దారులు వేలం పాటలో పాల్గొని ఆలయ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. శ్రావణమాస ఉత్సవాల సందర్భంగా చేపట్టవలసిన వివిధ ఏర్పాట్లు గురించి చర్చించుటకు వేలం పాట అనంతరం గండిక్షేత్రంలో చైర్మన్ కావలి కృష్ణతేజ ఆధ్వర్యంలో గండి ఆలయ పాలకమండలి సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశానికి పాలకమండలి సభ్యులందరూ హాజరుకావాలని కృష్ణతేజ కోరారు.

బంగారు దుకాణాలపై విజిలెన్స్ దాడులు

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక బంగారు దుకాణాలపై విజిలెన్స్ సీఐ నాయకుల నారాయణ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. మంగళవారం అందిన సమాచారం.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దాడులు చేశారు. గాంధీ రోడ్డులోని కొన్ని బంగారు దుకాణాలను తనిఖీ చేయడంతో మిగిలిన దుకాణాలు కూడా మూసివేశారు. వేంపల్లి పట్టణంలో మొత్తం 42 బంగారు దుకాణాలున్నాయి. దుకాణాల తనిఖీల్లో చాలా అవకతవకలు ఉన్నాయని తెలిసింది. విజిలెన్స్ అధికారులు బంగారు అంగళ్లపై దాడులు చేయడంతో బట్టలు షాపులతోపాటు మరి కొన్ని షాపులు కూడా మూసేశారు. దాడుల్లో విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు.

ఎంఇఒలు తరచూ తనిఖీలు నిర్వహించాలి : డిఇఒ

ప్రజాశక్తి - చాపాడు

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ఎంఇఒలు తరచూ తనిఖీలు నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్ తెలిపారు. మైదుకూరు ఎంఇఒ కార్యాలయంలో మంగళవారం ఆయన నియోజకవర్గ పరిధిలోని ఎంఇఒలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ ప్రతిరోజూ క్రమం తప్పకుండా ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు వివరాలను నమోదు చేయాలన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని మెనూ ప్రకారం అమలు జరిగేలా చూడాలన్నారు. నాణ్యత ప్రమాణాలను పాటించాలన్నారు. మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేయాలన్నారు. విద్యార్థులకు ఇప్పటికే అన్ని రకాల విద్యా కిట్లు పంపిణీ చేశామన్నారు. గ్రామస్థాయి పాఠశాలల్లో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. కార్యక్రమంలో ఎంఇఒలు పుష్పలత, నరహరి శర్మ పాల్గొన్నారు.

డ్రైవర్ల సమస్యలను ప్రభుత్వాలు గుర్తించాలి

- సేఫ్టీ డ్రైవర్స్ వ్యవస్థాపనలు అన్వర్ బాషా

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

డ్రైవర్ల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాలని సేఫ్టీ డ్రైవర్ వ్యవస్థాపకులు అన్వర్ బాషా కోరారు. డ్రైవర్లు అందరూ ఒక తాటిపైకి రావాలని, సమస్యలపై పోరాటం చేయాలని ఆయన జోడోయాత్రలో భాగంగా పిలుపునిచ్చారు. పట్టణంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అన్వర్ బాషా మాట్లాడుతూ టాక్సీ డ్రైవర్లు, క్యాబ్ డ్రైవర్లు మీద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చాలా చిన్నచూపు చూపిస్తున్నాయని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం వల్ల క్యాబ్ డ్రైవర్ లు, ఆటో డ్రైవర్లు రోడ్లమీద పడుతారని అన్నారు. టాక్సీ బండ్లకు గ్రీన్ టాక్స్, రోడ్ టాక్స్,టోల్ గేట్లు వంటివి చాలా భారంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో రాయలసీమ ఇన్చార్జి రామకృష్ణ యాదవ్, సభ్యులు రాఘవేంద్ర, కిషోర్, బసిరెడ్డి నాగేశ్వర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, ఓబుల్ రెడ్డి, అమర్నాథ్ రెడ్డి, యువరాజు, సుధాకర్ రెడ్డి, సుధాకర్, ఖాజా, జిలాన్, జయరాం రెడ్డి, అహ్మద్ బాషా పాల్గొన్నారు.

తాగునీటి చేతి బోరుకు మరమ్మతులు

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక పుల్లయ్య వీధిలో ఉన్న తాగునీటి చేతి బోరుకు అధికారులు మరమ్మతులు చేయించారు. స్థానిక గండి రోడ్డులో ఉన్న పుల్లయ్య తోట వీధిలో కొద్ది రోజులుగా తాగునీటి చేతి బోరు పని చేయలేదు. ఆ ప్రాంతంలో నీటి ఇబ్బందులు ఉండడంతో ప్రజలు చేతి బోరును మరమ్మతులు చేయించాలని సర్పంచ్ రాచినేని శ్రీనివాసులును కోరారు. స్పందించిన ఆయన సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి వెంటనే మరమ్మతులు చేయించారు. మంగళవారం చేతి బోరుకు మరమ్మతులు చేయడంతో ఆ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

దోమ కాటుతో వ్యాధులు వచ్చే ప్రమాదం

పులివెందుల టౌన్ :దోమ కాటు వల్ల వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని డాక్టర్ శాంతి కుమార్ తెలిపారు. మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం బాకరాపురం పరిధిలో జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా వైద్యాధికారి శాంతికుమార్ ఆధ్వర్యంలో దోమకాటు వల్ల వచ్చు వ్యాధుల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమ కాటు వల్ల మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా, బోదకాలు, మెదడు వాపు వ్యాధి వస్తాయని వివరించారు. దోమ కాటుకు గురికాకుండా జాగ్రత్త తీసుకోవాలని సూచించారు. సబ్ అధికారి సిద్దయ్య, ఆరోగ్య కార్యకర్తలు సోమ లింగారెడ్డి, సుజాత, ఆశా కార్యకర్త సులోచన, ప్రజలు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరును అభివృద్ధి చేయాలి

ప్రొద్దుటూరు పుట్టపర్తి సర్కిల్ : ప్రొద్దుటూరు అభివృద్ధికి నిధులు కేటాయిం చాలని మంగళవారం మంత్రి నారా లోకేష్‌ను డాక్టర్ జి.వి. ప్రవీణ్‌కుమార్‌రెడ్డి కోరారు. ఉండవల్లిలోని లోకేష్ నివాసంలో ప్రవీణ్ కలిశారు. ఈ సందర్భంగా ఆగి పోయిన ప్రొద్దుటూరు కూరగాయల మార్కెట్ బిల్డింగ్ పనులకు నిధులు మంజూరు చేయాలన్నారు. ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్లు, సిబ్బంది కొరత ఉం దన్నారు. పలు ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్న ఖాళీ పోస్టు లను త్వరగా భర్తీ చేయాలని కోరారు. ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో పారిశుధ్యం పరిష్కారానికి, ఇతర పనులకు నిధులు కేటాయించాలన్నారు. నియోజకవర్గంలో 5 ఏళ్ల కాలంలో కష్ట పడిన నాయకులు, కార్యకర్తలకే పార్టీ పదవులలో స్థానం కల్పించాలని నారా లోకేష్‌ను కోరారు.

పనిచేసిన కార్యకర్తలకు గుర్తింపు ఇవ్వండి

వేంపల్లె :టిడిపి కోసం పని చేసిన కార్యకర్తలకు గుర్తింపు ఇవ్వాలని టిడిపి నేత గంగాధర్ రెడ్డి కోరారు. మంగళవారం ఉండవల్లిలో జరిగిన ప్రజా దర్బార్‌లో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను వేంపల్లెకు చెందిన టిడిపి నేత గంగాధర్ రెడ్డి కలిసి వినతిపత్రం అందజేశారు. ఎన్నికల్లో టిడిపి కోసం పని చేశామని, అలాంటి కార్యకర్తలను గుర్తించాలని కోరామన్నారు. పార్టీలో ఉన్న చాలా మంది యువత ఉద్యోగ అవకాశాలు కోసం ఎదురు చూస్తున్నారని, అలాంటి వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించి ఆదుకోవాలని కోరారు. వేంపల్లెలో పలు సమస్యలు ఉన్నాయని, వాటిని కూడా పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు తొలగించాలని కోరారు. స్పందించిన మంత్రి నారా లోకేష్ పార్టీ కోసం పని చేసిన కార్యకర్తలకు గుర్తింపు ఇస్తామన్నారు. పులివెందుల నియోజకవర్గంలో పార్టీ బలోపేతం కోసం పని చేయాలని మంత్రి ఆదేశించినట్లు గంగాధర్‌రెడ్డి చెప్పారు.

BEFORE The DISTRICT CONSUMER DISPUTES REDRESSAL COMMISSION ONGOLE PRAKASAM DISTRICT

CC No : 29/2024

షేక్ కాజా జహీర్ .... ఫిర్యాది

వర్సెస్

అమెజాన్ సెల్లర్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ రిప్రజెంటెడ్ బై అథరైజ్డ్ సిగ్నేటరీ బెంగళూరు అండ్ అదర్స్ ....OPP పార్టీలు

To

OP No : 4

డెలివరీ కొరియర్ సెంటర్,
రిప్రజెంటెడ్ బై అథరైజ్డ్ పర్సన్,
లొకేటెడ్ ఎట్ నియర్ NH.167B,
బద్వేల్ రోడ్డు, కమ్మవారి పల్లి,
పోరుమామిళ్ల మండలం, కడప జిల్లా.

పై నెంబర్ కేసులో మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపినను మీరు తీసుకొనక ఉద్దేశ పూర్వకంగా తిప్పి పంపినందున శ్రీ కోర్టు వారు మీకు ఈ పేపర్ ప్రకటన ద్వారా నోటీసు పంపమని ఆర్డర్ వేసి ఉన్నారు వాయిదా తేది 16-07-2025 కావున ఆరోజు ఉదయం గం 10.30 నిమిషాలకి మీరు స్వయంగా గాని లేదా వకీలు ద్వారా గానీ పైకోర్టునకు హాజరై మీకుగల ఆక్షేపణలు తెలుపుకొనవలెయును లేనియెడల మీపరోక్షమున కేసు తీర్మానించబడునని తెలియజేయడమైనది.

// కోర్టు వారి ఉత్తర్వులు మేరకు //

వాయిదా తేది : 16-07-2025

ఇట్లు
తూమాటి విజయసారథి
అడ్వకేట్, ఒంగోలు.
ప్రకాశం జిల్లా